క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే దీక్షలు



నిరాహారదీక్షల్లో పాల్గొన్న జేఏసీ నాయకులు

నర్సాపూర్: డంప్‌యార్డు ఎత్తివేయాలన్న డిమాండ్‌తో పట్టణంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి రెండో రోజుకు చేరాయి. గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేయాల్సిన డంప్‌యార్డు ఎత్తివేయాలని జేఏసీ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డంప్‌యార్డుతో నర్సాపూర్ అడవులు, చెరువు పాడవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీక్షల్లో ఆయా పార్టీల నాయకులు శ్రీధర్‌గుప్తా, రాజేందర్, పంబాల్ల భిక్షపతి, రిజ్వాన్, శ్రీనివాస్‌గుప్తా, బాల్‌రెడ్డి, అంజిగౌడ్, జైపాల్, షేక్‌హుస్సేన్, దేవేందర్‌యాదవ్, జనార్దన్, అజ్మత్, ఆంజనేయులుగౌడ్, లక్ష్మణ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రేగోడ్(మెదక్): ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 55 మంది విద్యార్థులు ఉండగా.. ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండటంతో విద్య కుంటుపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారు గ్రామస్తులతో కలిసి ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకొని ఆందోళనకు దిగారు. ఎంఈఓ గురునాథ్ మాట్లాడుతూ.. మండలానికి పదిమంది ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో నలుగురు విధుల్లో చేరారని, మిగతా వారు ఇంకా రాలేదని చెప్పారు.

కేసీ వేణుగోపాల్‌ను కలిసిన సుభాన్



వేణుగోపాల్‌తో సుభాన్

టేక్మాల్(మెదక్): జాతీయ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్‌ను మంగళవారం ఢిల్లీలో టేక్మాల్‌కు చెందిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుభాన్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఆయనను సుభాన్ శాలువాతో సన్మానించి, మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయమై వేణుగోపాల్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాపన్నపేట(మెదక్): సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బుధవారం మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ మోహన్ బాబు చెప్పారు. 33 కేవీ మిన్‌పూర్, కుర్తివాడ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 11.30 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు.

21న పార్కింగ్ వేలం

మెదక్ కలెక్టరేట్: మహా శివరాత్రి సందర్భంగా ఏడుపాయల జాతరలో పార్కింగ్ నిర్వహణను ఈనెల 21న బహిరంగా వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు గురువారం సాయంత్రం 5 గంటలలోగా పాతంశెట్టిపల్లి గ్రామ కార్యదర్శికి రూ.5వేలు చెల్లించాలన్నారు. పూర్తి సమాచారం కోసం పోతంశెట్టిపల్లి పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కొల్చారం(నర్సాపూర్): క్షయ(టీబీ)వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా రోగనిర్ధారణ కోసం మండలంలోని రంగంపేట పీహెచ్‌సీలో మంగళవారం నిక్షయ్ శిబిర్ కింద ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో క్షయ కేసుల నిర్ధారణకు చేపట్టిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి క్షయవ్యాధి నిపుణులు రోగుల నుంచి తెమడను సేకరించడంతో పాటు ఎక్సరేలను తీశారు. వ్యాధి నిర్ధారణ రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. 151 మందికి ఎక్సరేలు తీశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బరువు తక్కువగా ఉన్నవారు, ఎడతెరిపి లేకుండా దగ్గుతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలల పాటు ఉచిత మందులు, పౌష్టికాహారం అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.500లు రోగుల ఖాతాలో జమ చేస్తుందన్నారు. పీహెచ్‌ఎం సుజాత, సూపర్‌వైజర్ మహేశ్‌కుమార్, నిక్షయ్ శిబిర్ సిబ్బంది, ఏఎన్‌ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మల్లన్న జాతర



శివ్వంపేట(నర్సాపూర్): మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



కొల్చారం(నర్సాపూర్): కల్యాణోత్సవంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చెన్నపూర్‌లో భక్తిశ్రద్ధలతో మల్లన్న జాతర జరిగింది. ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం అగ్నిగుండాలు తొక్కి, బండ్లు, బోనాలను ఊరేగించారు. ఎల్లమ్మదేవికి పలువురు ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్లన్న, ఎల్లమ్మ దయతో ప్రజలు సంతోషంగా ఉండాలని తెలిపారు. అనంతరం దేవతామూర్తులను జిల్లా గ్రంథాయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, నవీన్‌గుప్తా తదితరులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, మాజీసర్పంచ్ భారతి భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న కల్యాణోత్సవం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ హాజరై తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో, పాడిపంటలతో వృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు హరీశ్, జిల్లా నాయకులు రాజేందర్, బాలరాజు, నారాయణ రెడ్డి, చిలప్‌చెడ్, హత్నూర మండలాల పార్టీ అధ్యక్షులు నాగేష్, ప్రభుగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.



మెదక్‌లో గౌడ సంఘం బోనాల ఊరేగింపు

ఎల్లమ్మా చల్లంగా చూడమ్మా

పట్టణ శివారులోని పసుపులేరు ఒడ్డున కౌండిన్యుల ఆరాధ్య దైవం ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలను గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల సిగాలు, కోలాటం, యువకుల నృత్యాలతో బోనాల ఉరేగింపు జరిగింది. అనంతరం భక్తులు బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో గౌడ సంఘం నాయకులు రమేశ్‌గౌడ్, విద్యాధర్ గౌడ్, కృష్ణాగౌడ్, జనార్దన్‌గౌడ్, అశోక్ గౌడ్, నర్సింలుగౌడ్, ముత్యంగౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు. **మెదక్ మున్సిపాలిటీ:**



చిన్నశంకరంపేట(మెదక్): టీ.మాందాపూర్ యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చిన్నగొట్టిముక్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. డీఈఓగా ఉమర్ ఫారుక్, ఎంఈఓగా రిషిక, హెచ్‌ఎంగా మణికంఠ, సీఆర్పీగా ఫైజల్, ఉపాధ్యాయులుగా పల్లవి, నిత్రా, నందిని, అక్షిత, నూతన, కీర్తన, కార్తీక్‌లు వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థుల బోధనా సరళిని ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. అనంతరం ఉత్తమ బోధన చేసిన వారిని అభినందించారు.

టీ.మాందాపూర్ పాఠశాలలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని టీ.మాందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా డీఈఓగా దస్తగిరి, ఎంఈఓగా నిరోషా, హెచ్‌ఎంగా నవనీత, పాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు. విద్యార్థుల ప్రతిభను హెచ్‌ఎం ఫణీంద్రచారి అభినందించారు.



శివ్వంపేట(నర్సాపూర్): చిన్నగొట్టిముక్లలో..

యువతి అదృశ్యం

టేక్మాల్(మెదక్): యువతి అదృశ్యమైన మండలంలోని మెర్గోనికుంట తండాలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య కథనం మేరకు.. తండాకు చెందిన జరుపుల పుల్‌సింగ్ చిన్న కూతురు అనిత(20) ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. 17న మధ్యాహ్నం పొలం వద్ద బోరు బంద్ చేసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పొలం వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అనిత ఇంటి నుంచి వెళ్లినప్పుడు బూడిద రంగు టాప్, తెల్ల ప్యాంట్, చున్నీ వేసుకుందని తెలిపారు. యువతి తండ్రి పుల్‌సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

కొల్చారం(నర్సాపూర్): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రానికి చెందిన శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్రీడా పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా కబడ్డీ, ఖోఖో, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు దీక్షిత్ గౌడ్, ఉపాధ్యాయులు, యువజన సంఘం ఉపాధ్యక్షుడు సాయికుమార్, మల్లేశం, సాకేత్, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న దీక్షిత్ గౌడ్

గవ్వలపల్లి రైతులకు సాగునీరు



గవ్వలపల్లి పంటలకు మత్తడి నుంచి నీరు వదులుతున్న ఇరిగేషన్ సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): అంబాజిపేట పెద్ద చెరువు సాగునీరును మత్తడి ద్వారా గవ్వలపల్లి రైతుల పంటపొలాలకు సాగునీరు అందించేందుకు వాగులోకి నీరు వదిలామని ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాక్షిలో సాగునీరు వృథా అనే కథనం ప్రచురితమైంది. దీంతో ఇరిగేషన్ డీఈ స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. గవ్వలపల్లి రైతులకు సాగునీరు అందడంలేదని రైతులు మొరపెట్టుకోవడంతో వాగుద్వారా మత్తడిని నింపేందుకు చెరువు నీరు వదిలినట్లు తెలిపారు. గవ్వలపల్లి రైతులకు సాగునీరు అందించేందుకు ఉన్న కాల్వ దెబ్బతినడంతో వాగు మత్తడి నుంచి పంట పొలాలకు సాగునీరు అందించనున్నట్లు వివరించారు. నీరు వృథాకాకుండా చర్యలు చేపట్టామన్నారు.

సాగునీరు వృథా




మక్కరాజిపేట శివారులో వృథాగా పోతున్న కాళేశ్వరం కాల్వ నీరు

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజిపేట శివారులోని కాళేశ్వరం కాల్వ కట్టను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో నీరు వృథాగా పోతోంది. గజ్వేల్ వైపు నుంచి కాల్వల ద్వారా చెరువులను నింపడానికి అధికారులు నీటిని వదిలారు. మక్కరాజిపేట శివారులో కాల్వను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో చెరువుల్లోకి రావాల్సిన నీరు వృథాగా పోతున్న విషయం మక్కరాజిపేట రైతులు అధికారులకు తెలిపారు. అధికారులు కాల్వను పూడ్చి చెరువుల్లోకి నీటిని నింపాలని వారు కోరుతున్నారు.

వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ఏడీఏ పుణ్యవతి



బతుకమ్మతండాలో వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ పుణ్యవతి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు వరిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ పుణ్యవతి అన్నారు. మంగళవారం మండల కేంద్రం కౌడిపల్లి బతుకమ్మతండాలో పలువురు రైతులు వరిపొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో మొగిపురుగు, అగ్గి తెగులు, బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులును గమనించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరిపంటలో ఆకుకొనల నుంచి కిందికి ఎండినట్లు గమనిస్తే బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులుగా గుర్తించాలన్నారు. నివారణ కోసం నత్రజని ఎరువుల వాడకం తగ్గించడం లేదా వాయిదా వేయడం చేయాలన్నారు. పొలంలో నీటిని తొలగించి ఆరబెట్టాలని చెప్పారు. దీంతో పాటు ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు, కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లేదా అగ్రిమైసిన్ 0.4గ్రామ, కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు. మొగిపురుగు నివారణకు క్లోరంత నిలిప్రోల్ 60మిలీ ఎకరాకు, అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6మిలీ లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు. రైతులు ప్రతీరోజు వరిపంటను పరిశీలించాలని సమస్యలుంటే వ్యవసాయ అధికారులకు చెప్పాలని తెలిపారు. మోతాదుకు మించి యూరియా వాడితే రైతులకు నష్టం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ స్వప్న, ఏఈఓ సాహితి, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకులో డిపాజిట్ చేస్తేనే మేలు

డీసీసీబీ మేనేజర్ చంద్రశేఖర్



బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ మేనేజర్ చంద్రశేఖర్

చిన్నశంకరంపేట(మెదక్): సహకార బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేస్తేనే మేలు పొందవచ్చని డీసీసీబీ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని జంగరాయి రైతు సహకార సంఘం వద్ద రైతులకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీసీసీబీలో డబ్బులు డిపాజిట్ చేస్తే 8 సంవత్సరాల 9 నెలల్లో రెట్టింపు అవుతాయని తెలిపారు. రైతులు అత్యధిక వడ్డీ అందించే డీసీసీబీలోనే డిపాజిట్ చేయాలని సూచించారు. బ్యాంకు ఖాతాదారులకు అత్యధిక వడ్డీతో పాటు బంగారు రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. బ్యాంకు ఖాతాదారులకు యూపీఐ, గూగుల్ పే, ఫోన్‌పే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ సంగమేశ్వర్, జంగరాయి సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటాం

నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి



మాట్లాడుతున్న సీడీపీఓ హేమభార్గవి

కౌడిపల్లి(నర్సాపూర్): పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమభార్గవి అన్నారు. మంగళవారం మండలంలోని ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవ అభివృద్ధి, ఆరోగ్యంపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. వెయ్యిరోజుల ప్రణాళికలో భాగంగా పాప కడుపులో ఉన్నప్పటి నుంచి రెండో పుట్టినరోజు వచ్చేవరకు ఆరోగ్యం కోసం పిల్లల పోషణ, పోషకాహారం, చేతిశుభ్రత, పరిశుభ్రత, చెత్తనివారణ చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనతను నివారించేందుకు పాలు, కోడిగుడ్డు, ఆకుకూరలు, బెల్లం అధికంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత, ఉపాధ్యక్షురాలు అనిత, కోశాధికారి కవిత, సీసీలు, వీఓఏలు మండలంలోని వివిధ గ్రామాల మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



టేక్మాల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



పెద్దశంకరంపేటలో ..

టేక్మాల్(మెదక్): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ మండలాధ్యక్షుడు నవీన్ గుప్తా, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మల్లికా అశోక్ అన్నారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండల కేంద్రం టేక్మాల్, పల్వంచ గ్రామాల్లోని అభ్యర్థులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు అంజిరెడ్డికి వేయాలని కోరారు. కార్యక్రమంలో ఓటర్లు సంధ్యారాణి, మీదిగొని సాయిబాబా, శంకర్, సత్యనారాయణ, కాళి ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

చేగుంట(తూప్రాన్): పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి గోదావరి మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి బీజేపీ తరపున పోటీలో ఉన్న అంజిరెడ్డిని గెలిపిస్తే యువతకు అండగా ఉండి అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మండలాధ్యక్షులు భూపాల్, మోర్చా అధ్యక్షురాలు లావణ్య పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలను గెలిపించాలని పార్టీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు కృష్ణ, నాయకులు తదితరులు ఉన్నారు.

పతి గెలుపు కోసం సతి ప్రచారం

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి కరీంనగర్–ఆదిలాబాద్–మెదక్–నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలంటూ మండల కేంద్రం మాసాయిపేటలో అభ్యర్థి సతీమణి గోదావరి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి గెలుపు కోసం ఉమ్మడి మండల వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎస్ఆర్ ట్రస్ట్ తరఫున ప్రజాసేవ చేస్తున్న అంజిరెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మండలాధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు దాసు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, శివరాం, వెంకటేశం, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాసాయిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సతీమణి గోదావరి, నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ ఉద్యోగాలు భర్తీ చేస్తాం

పాపన్నపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తూ ఉద్యోగాలు భర్తీ చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం వారు పాపన్నపేటలో ప్రచారం నిర్వహించారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, మొల్‌సాబ్, గోవింద్ నాయక్, శ్రీకాంతప్ప, ఆకుల శ్రీనివాస్ తదితరులు కోరారు.

◆ ఇందిరమ్మ ఇల్లు పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో ఇందిరమ్మ ఇల్లు మంజూరు లబ్ధిదారుల ప్రస్తుత ఇంటిని ఎంపీడీఓ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో ప్రభుత్వం 49 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. మంజూరు సమయంలో అధికారులు లబ్ధిదారుల ఎంపిక సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ బలరాం గ్రామానికి వెళ్లి లబ్ధిదారుల ఇంటిని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

◆ ఏడుపాయల్లో కనీస సౌకర్యాలు కరువు
బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో కనీస సౌకర్యాలు లేవని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ విమర్శించారు. మంగళవారం ఆయన ఏడుపాయల దుర్గామాతను దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏటా సుమారు రూ.15 కోట్ల ఆదాయం వచ్చే ఏడుపాయల్లో కనీస సౌకర్యాలు లేక భక్తులు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆయన వెంట బీజేవైఎం నాయకులు నరేష్, దేశ్‌పాండే, అరవింద్, గిరి, జగదీశ్, అనిల్, శ్యాం ఉన్నారు.

◆ ఇబ్బందులు లేకుండా చూడండి

పెద్దశంకరంపేట(మెదక్): మహాశివరాత్రిని పురస్కరించుకొని మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఏర్పాట్లపై తహసీల్దార్ గ్రేస్‌బాయి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. జాతర సందర్భంగా పోలీస్, వైద్య, విద్యుత్, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఎస్ఐ.శంకర్, వైద్యాధికారి షరీపొద్దీన్, ఎఫ్‌ఆర్‌ఓ వికాస్, ఆలయ కమిటీ సభ్యులు బాపురాజు, రాజు, సీతారం, పరమేశ్వర్‌రెడ్డి, కందుకూరి పాల్గొన్నారు.